క్లుప్తంగా

కొన్నేళ్లుగా 'మరుగు'నపడ్డాయి



పిచ్చిమొక్కల మధ్య మరుగుదొడ్లు, మూత్రశాలలు

నవాబుపేట: అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారి ఏళ్లు గడుస్తున్నా.. సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం స్పందించి.. మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పంటల పరిశీలన



టమాటా సాగును పరిశీలిస్తున్న నాయకులు

అనంతగిరి: వడగళ్ల వానకు వికారాబాద్ మండలం ఎర్రవల్లిలో దెబ్బతిన్న పంటపొలాలను ఆదివారం బీఆర్ఎస్ మండల నాయకులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పంట నష్టం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రైతు సమన్వయ సమితీ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, పలువురు నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని కీలలకు హరిత మొక్కలు హరీ



తట్టెపల్లి వద్ద కాలిపోయిన మొక్కలు

పెద్దేముల్: ప్రధాన రహదారికి ఇరు వైపులా నాటిన హరితహారం మొక్కలు కాలిపోయాయి. తాండూరు-జహీరాబాద్ ప్రధాన రహదారి పెద్దేముల్ మండల తట్టెపల్లి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన నిప్పు పడేయడంతో సుమారు 30కి పైగా రెండేళ్ల మొక్కలు కాలిపోయాయి. అదే విధంగా తాండూరు-హైదరాబాద్ ప్రధాన రహదారి కందనెల్లి వద్ద ఏర్పాటు చేసిన మొక్కలకు సంరక్షణ లేకపోవడంతో అవి పాడవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మొక్కలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మల్లన్న జాతర



ఆలయంలో ఎమ్మెల్యే తదితరులు

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య చెప్పారు. ఆదివారం మండలంలోని శేరిగూడ గ్రామంలో జరిగిన మల్లన్న జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతర ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకని తెలిపారు. దేవాలయ ఆవరణలో అగ్ని గుండాల ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటి నుంచి స్వామి వారికి బోనాలను సమర్పించుకున్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ మైలారం సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, కురుమ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, ఉప అధ్యక్షుడు చీర శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, నాయకులు గోపాల్, సాత ప్రవీణ్ కుమార్, శ్రీనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యకు ఘన సన్మానం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య సంస్కృత విభాగంలో పీహెచ్‌డీ పూర్తిచేసి ఇటీవలే డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆదివారం స్థానికులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సత్యప్రమోద్‌రావు మాట్లాడుతూ.. కృష్ణయ్యను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కృష్ణయ్య ఒకవైపు కుటుంబ భారం మోస్తూ, తన స్వగ్రామంలో గోశాలను నిర్వహిస్తూ డాక్టరేట్ పుచ్చుకోవడం అభినందనీయమన్నారు. నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్యగౌడ్, శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రెడ్డి, బుచ్చిలింగం పాల్గొన్నారు.

నిధులు లేక నిలిచిన పనులు

సర్కారు పనులంటే అధికారులకు, నిర్మాణదారులకు ఎంత నిర్లక్ష్యమో ఈ పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తే అర్థమవుతుంది. అదనపు గది కోసం ఏడేళ్ల క్రితం మొదలు పెట్టిన భవనం.. నిధుల లేమితో ప్రస్తుతం బూత్‌బంగ్లాను తలపిస్తోంది. మరిన్ని నిధులు వెచ్చించి వినియోగంలోకి తేవాలన్న మనసు పాలకులకు రాక.. వెచ్చించిన ప్రజాధనం కాస్త వృథా అయింది.

- అసంపూర్తిగా పాఠశాల భవనం
- ఏడేళ్లు గడుస్తున్నా.. పురోగతి శూన్యం
- పశువుల పాకగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా అదనపు పాఠశాల భవనం

బంట్వారం: అదనపు నిధులు మంజూరు కాకపోవడంతో ఉర్దూ మాధ్యమ పాఠశాల అదనపు భవనం పనులు ఏడేళ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా విద్యార్థులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. బంట్వారం మండలం తొర్మామిడికి 2012–13 సంవత్సరంలో ఉర్దూ మీడియం పాఠశాలకు అదనపు భవనం మంజూరైంది. దీనికి సంబంధించి అప్పట్లో ఆర్ఎంఎస్ఎ కింద రూ.26.61 లక్షలు మంజూరు కాగా.. 2015 సంవత్సరంలో పనులు ప్రారంభించారు. నాటి సర్పంచ్ మొగులయ్య ఏడాది కాలంలోనే నిర్మాణం పూర్తి చేశారు. కానీ నిధులు చాలక ఫ్లోరింగ్, ఉడ్‌వర్క్, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ పనులు నిలిచిపోయాయి. పనులు నిలిచి ఏళ్లు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

పశువుల పాకగా..

పాఠశాల అదనపు భవనం పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు పశువుల పాకగా వినియోగిస్తున్నారు. మూగజీవాలను అక్కడే ఉంచుతున్నారు. దీంతో పాఠశాల నూతన భవనం కాస్త బంజరు దొడ్డిగా మారింది. పక్కనే పాత భవనంలో ఉర్దూ మీడియం పాఠశాల కొనసాగుతోంది. నిర్మాణంలో ఉన్న భవనంలో పశువులను కట్టేయడంతో పరిసర ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. దీంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తుండగా.. విద్యార్థులు, ఉపాధ్యాయులు దుర్వాసన భరించలేకపోతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. 2015లో తాను పనులు చేపట్టినప్పటికీ.. నిర్మాణ సామగ్రికి ధర 2012–13 నాటి ప్రకారం చెల్లించారు. అప్పట్లో ఇచ్చిన నిధుల మేరకు నిర్మాణం పూర్తిచేశాం. సంబంధిత అధికారులు అవసరమైన నిధులు మంజూరు చేస్తే.. మిగతా పనులు పూర్తిచేస్తా.

– మొగులయ్య, మాజీ సర్పంచ్

డీఈఓ దృష్టికి తీసుకెళ్తా



సమస్యను జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్తా. అసంపూర్తి భవనాన్ని పూర్తి చేసేలా కృషి చేస్తా. సంబంధిత అధికారులతోనూ మాట్లాడతా. అవరమైన అదనపు నిధుల కోసం తనవంతు ప్రయత్నం చేస్తాను. త్వరలోనే విద్యార్థులకు ఉపయోగ పడేలా భవనాన్ని వినియోగంలోకి తెస్తాను.

– చంద్రప్ప, ఎంఈఓ

ఇళ్ల మధ్యే విద్యుత్ స్తంభాలు

భయాందోళన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు



చిట్టిగిద్దలో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభం, తీగలు

నవాబుపేట: నివాసాలకు సమీపాన విద్యుత్ స్తంభాలు, ఇళ్లకు ఆనుకునే విధంగా విద్యుత్ తీగలు ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భయంగా ఉందని చెప్పినా.. ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామం మైనార్టీ కాలనీలో ఇళ్ల మధ్య, ఇళ్లకు ఆనుకొనే స్తంభాలు, అతి సమీపం నుంచే విద్యుత్ లైన్లు ఉండడంతో స్థానికులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. గాలి వీచినప్పుడు, గాలీవాన వచ్చినప్పుడల్లా భయపడుతున్నామని, ఎప్పుడు తెగి పడతాయోనని భయపడుతున్నామని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. విషయం విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య శుభోదయం కార్యక్రమంలో భాగంగా కాలనీకి వచ్చినప్పుడు ఫిర్యాదు చేశామని, స్పందించిన ఆయన తక్షణమే విద్యుత్ స్తంభాలు, తీగల సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అయినా ట్రాన్స్‌కో సిబ్బంది ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతరు చేశారని కాలనీవాసులు మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఇళ్ల మధ్య నుంచి స్తంభాలు తొలగించాలని కోరుతున్నారు.

'జన చైతన్య'ను జయప్రదం చేయండి



యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

తాండూరు టౌన్: సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నుంచి 29 వరకు నిర్వహించనున్న జనచైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తూ.. రాష్ట్ర ప్రజలను చైతన్య పరచడంలో భాగంగా యాత్ర నిర్వహిస్తోందని తెలిపారు. కులమతాల మధ్య చిచ్చుపెట్టి, ప్రజాసంక్షేమాన్ని మరిచిన కేంద్ర ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

నిరుద్యోగులపై నిర్లక్ష్యం



కొడంగల్: కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

- విద్యార్థుల జీవితాలతో కేసీఆర్ చెలగాటం
- నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల ధ్వజం
- పేపర్ లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్

కొడంగల్: నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ప్రశ్న పత్రాల లీకేజీతో విద్యార్థుల జీవితాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ చెలగాటం ఆడుతున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన తెలుపుతూ ఆదివారం అంబేడ్కర్ చౌరస్తాలో కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేసి మాట్లాడారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన పోటీ పరీక్షల పేపర్లను లీకేజీ చేసి నిరుద్యోగులకు అన్యాయం చేశారని, లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, ఆనంద్‌రెడ్డి, నయీమ్, శంకర్‌నాయక్, దాము, రాము, అశ్వాక్, ఆసీఫ్‌ఖాన్, తార్యానాయక్, సంజీవరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: మంత్రుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అసమర్థ ప్రభుత్వం దిగిపోవాలి

దౌల్తాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి బీఆర్ఎస్ అసమర్థతే కారణమని, నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం దిగిపోవాలని కాంగ్రెస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేసి మాట్లాడారు. ఈ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నాయకులు వెంకట్రాములు, మాధవరెడ్డి, రెడ్యానాయక్, మొగులప్ప, ఆనంద్, దస్తప్ప, మొహన్‌నాయక్ ఉన్నారు.

వేరుశనగ రైతుల వెతలు



మార్కెట్లో వేరుశనగను తూకం వేస్తున్న నిర్వాహకులు

- ధర లేక దిగాలు పడుతున్న వైనం
- ఆ ఇద్దరు చెప్పిందే రేటు..

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్లో వేరుశనగకు మద్దతు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. ఇందుకు శనివారం బీట్లో జరిగిన సంఘటన రైతులను ఆందోళనకు గురిచేసింది. తాండూర్, పరిగి ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు రాకపోవడం, వికారాబాద్ నుంచి వచ్చిన ఆ ఇద్దరే మార్కెట్‌ను శాసిస్తుండడంతో సాగుదారులు దిక్కులు చూస్తున్నారు. ఆ వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క శనివారం రోజే.. క్వింటాల్‌కు ధర రూ. వెయ్యి తేడా పలకడంతో రైతులు తలలు పట్టుకున్నారు. పరిగిలో క్వింటాల్‌కు రూ.7,500 వరకు ఉండగా.. ధారూరులో మాత్రం 6,880లకే పరిమితమైంది. ఎక్కువ మొత్తంలో క్వింటాల్‌కు రూ.5,700 నుంచి 6,500 వరకు ధర పలుకుతోంది. కొంతమంది రైతులు నాణ్యతతో కూడిన పంటను బీటుకు తీసుకురాకపోవడంతో.. ఆ ప్రభావం ఇతరులపై పడుతోందని రైతులు వాపోతున్నారు. నాణ్యమైన వేరుశనగ మార్కెటకు తెస్తే.. మద్దతు ధర లభిస్తుందని, పొలం లోంచి తీసి, కాయను ఎండబెట్టకుండా తీసుకువస్తే బూజుపట్టి పాడవుతుందని అడ్తిదారులు చెబుతున్నారు. ఏది ఏమైనా పంట పండించిన వారికంటే.. కొనుగోలు దారులదే పై చేయి కావడంతో కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని, ప్రస్తుత ధర గిట్టుబాటు కావడం లేదని, ఇలా కావాలనే చేస్తూ మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆరోపించారు.

నేడు ప్రజావాణి

తాండూరు రూరల్: తాండూరు తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కావున రైతులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కోరారు.

లబ్ధిదారుల ఎంపిక నేడు

దోమ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారులను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తామని ఎంపీపీ అనసూయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 265 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా.. అందులో 8 మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తామని చెప్పారు. మండలానికి మొత్తం రూ.7 లక్షల 60 వేల సబ్సిడీ గ్రాంట్స్ రాగా.. అందులో ముగ్గురు మహిళలు, ఐదుగురు పురుషులను ఎంపిక చేస్తామని, దరఖాస్తు చేసుకున్న వారు సకాలంలో రావాలని కోరారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మైనార్టీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శైలజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధి గ్రామాల నుంచి 220మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మొత్తం 20యూనిట్లు ఉన్నాయని, ఇంటర్వ్యూల ద్వారా అర్హులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. వికలాంగుల నుంచి ఆరుగురు దరఖాస్తు చేసుకోగా ఒకరిని ఎంపిక చేయనున్నామని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి లేఖ రాశామని ఆమె చెప్పారు.

యువకవికి అభినందనలు

షాద్‌నగర్‌టౌన్: శ్రీ శుభకృత్ నామ ఉగాది కవి సమ్మేళనాన్ని పురస్కరించుకొని ఆదివారం మహబూబ్‌నగర్‌లోని టీచర్స్ కాలనీలోని లుంబిని పాఠశాలలో నిర్వహించిన కవి సమ్మేళనంలో షాద్‌నగర్‌కు చెందిన యువకవి రవిప్రకాష్ హర్మాళ్ పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో జరిగిన కవి సమ్మేళనంలో తెలుగు నామ సంవత్సరంపై కవి రవిప్రకాష్ హర్మాళ్ కవిత్వాన్ని వినిపించి అభినందనలు పొందారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జిల్లా నూతన కమిటీ సభ్యులు వీరే

అనంతగిరి: తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం వికారాబాద్ జిల్లా నూతన కమిటీని ఆదివారం వికారాబాద్‌లో ఎన్నుకున్నారు. మహిళా సమాఖ్య భవనంలో జరిగిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా రాంచంద్రయ్య, గౌర అధ్యక్షుడిగా నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్న కుమార్, కోశాధికారిగా సుభాష్, ఉపాధ్యక్షులుగా బాలరంగాచారి, రామకృష్ణ, కార్యనిర్వాహణాధికారిగా మాణిక్యం, సంయుక్త కార్యదర్శులుగా నర్సింగ్‌రావు, సత్యనారాయణరెడ్డి, ప్రచార కార్యదర్శులుగా శ్రీనివాస్, రాజశేఖర్, కార్యవర్గసభ్యులుగా యాదయ్య, జహంగీర్, శ్రీశైలం, రమేష్, మొగులయ్య, వెంకటయ్య, నాగయ్య, నర్సింగ్, ఆనంద్ రావు, ఇస్మాయిల్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీతో పాటు పంచాయతీ కార్యదర్శుల, జేఏసీ వికారాబాద్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రాంచంద్రయ్య, కో–కన్వీనర్‌గా ఫారూక్, తారకచారి, వీణా, సభ్యులుగా గోపాల్, రాము, రవి, జహంగీర్, మొగులయ్య, ఆనందరావు, రాఘవేందర్‌గౌడ్, రవి, రాములు, బాలరంగాచారి, రాజశేఖర్, సత్యనారాయణరెడ్డి, అశోక్, లక్ష్మి, ఇందిరా, శ్రీశైలంను నియమించారు.

'ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి'



మోమిన్‌పేట: ఉల్లిపంటను పరిశీలిస్తున్న మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: వడగళ్ల వర్షానికి రైతులు నష్టపోయారని, ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని ఆదుకోవాలని మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలో పర్యటించి పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఎకరాకు లక్ష పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం ఇవ్వాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఒగ్గు మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మొరంగపల్లిలో టమాట పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆరు గాలం శ్రమించి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేసిందని, దీంతో రైతు కష్టార్జితం తుడిచిపెట్టుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూరగాయ, బొప్పాయి, అరటి, ఉల్లి, మొక్కజొన్న, జొన్న పంటలు చేతికి రాకుండా పోయి.. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

దెబ్బతిన్న టమాటా

అనంతగిరి: వడగళ్ల బీభత్సానికి వికారాబాద్ మండలంలో టమాటా పంట పూర్తిగా దెబ్బతిన్నది. మండలంలో సుమారు 300 ఎకరాల్లో టమాట సాగుచేయగా.. ఈ అకాల వర్షానికి దాదాపు పంట మొత్తం తుడిచిపెట్టుకు పోయిందని, ప్రభుత్వం వెంటనే పంటనష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న లావణ్య

మొయినాబాద్/చేవెళ్ల: చేవెళ్ల మండల పరిధిలోని రామన్నగూడలో వర్షానికి ఓ ఇల్లు కూలింది. శనివారం రాత్రి బలమైన గాలులు వీస్తూ వర్షం పడడంతో గ్రామానికి చెందిన దుంప లలిత ఇల్లు పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. వెంటనే ఇంట్లో నుంచి అందరూ బయటకు రావడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. 10 నెలల క్రితమే ఇల్లు నిర్మించుకోగా వర్షం కారణంగా ఇల్లు కూలిపోవడంతో లలిత కటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ లావణ్య వర్షానికి కూలిన ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

'పది'కి పక్కా ప్రణాళిక



గోకఫసల్‌వాద్ పాఠశాలలో టెస్టు రాస్తున్న టెన్త్ స్టూడెంట్స్ (ఫైల్)


- వందశాతం ఫలితాల సాధనకు కార్యాచరణ
- ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీ అవర్స్
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

దౌల్తాబాద్: విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి చాలా కీలకమైంది. టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. అలాగే విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యాశాఖ స్టూడెంట్స్‌కు ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట అదనపు సమయాన్ని కేటాయించింది. దీనికి అనుగుణంగా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

నెలాఖరు వరకు..

మండలంలో 6 ఉన్నత, ఎయిడెడ్, కేజీబీవీ ఉన్నత పాఠశాలల్లో 375 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించి సిలబస్ మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంది. విద్యార్థులకు సూచించిన తేదీల్లో ఉదయం, సాయంత్రం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. వాటి నిర్వహణకు సంబంధించి పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతి గురించి తెలపాలి. ప్రధానోపాధ్యాయులు విధిగా స్టడీ అవర్స్ పరీక్ష నిర్వహణను మానిటర్ చేస్తూ కరోనా నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. చదువులో వెనకబడిన విద్యార్థుల విషయంలో పురోగతి కోసం రోజుకు రెండు గంటలు ప్రత్యేక తరగతులు చెప్పన్నారు. విద్యార్థులను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించి, ప్రతి ఉన్నత పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు క్లాసులు చెప్పన్నారు.

నూరుశాతం ఫలితాలే లక్ష్యం



పదో తరగతి పరీక్షల నిర్వహణకై హెచ్ఎంలకు సమావేశం ఏర్పాటు చేశాం. ఈ నెలాఖరు వరకు సిలిబస్ పూర్తి చేసి, ఏప్రిల్‌లో రివిజన్ చేయాలని సూచించాం. ఇప్పటి నుంచే పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. ప్రత్యేక తరగతుల షెడ్యూల్ ఆయా స్కూళ్ల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల వారీగా వివరించాం. వందశాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ప్రణాళిక చేపట్టాం.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్